సొంతింటి కల.. సాకారమైన వేళ..!

- ఆకర్షణీయంగా పెదజాలరిపేట టిడ్కో ఆదర్శగ్రామం
- రూ.9 కోట్లతో ఐదు బ్లాకులుగా గ్రామం నిర్మాణం
- తూర్పులో 2,743 మందికి టిడ్కో ఇళ్ల కేటాయింపు


పెదజాలరిపేటలో నిర్మించిన ఆదర్శగ్రామం




దబ్బందలోని టిడ్కో ఇల్లు

ఎంవీపీ కాలనీ: దశాబ్దాలుగా తూర్పు నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్న సొంతింటి కల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో సాకారమైంది. నగరంతో పాటు నగర శివార్లలోనూ పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు జరిగాయి. పెదజాలరిపేటలో నిర్మించిన టిడ్కో 'ఆదర్శగ్రామం' ద్వారా 120 మంది లబ్ధిపొందారు. నియోజకవర్గంలో మరో 2,743 మందికి టిడ్కో ఇళ్ల కేటాయింపులు జరిగాయి. ఎలక్ట్రికల్, వాటర్ కనెక్షన్, యూజీడీ వ్యవస్థలతో కూడిన సకల సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది.

తూర్పులో 2,743 మంది లబ్ధిదారులు

తూర్పు నియోజకవర్గ పరిధిలోని జోన్–3లో 2,743 మంది టిడ్కో లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 515 మందికి 300 ఎస్ఎఫ్‌టీ ఫ్లాట్, 463 మందికి 365 ఎస్ఎఫ్‌టీ ఫ్లాట్, 1765 మందికి 420 ఎస్ఎఫ్‌టీ ఫ్లాట్ చొప్పున మంజూరు చేశారు. ఒక్కో ఫ్లాట్‌కు ఎస్ఎఫ్‌టీ ప్రకారం రూ.5.65 లక్షల నుంచి రూ.7.65 లక్షలు ఖర్చు అవుతుండగా రూ.2.64 లక్షల నుంచి రూ.3.65 లక్షల వరకు బ్యాంకు రుణంగా ప్రభుత్వం సమకూర్చింది. జోన్–3 అధికారులు, సిబ్బంది చొరవతో రుణ సదుపాయం ప్రక్రియ పూర్తిచేశారు. పైనాపిల్ కాలనీతో పాటు పలు చోట్ల ఇళ్ల కేటాయింపులు జరిగాయి.

రూ.9 కోట్లతో ఆదర్శగ్రామం

పెదవాల్తేర్ జాలరిపేటలో ఆదర్శగ్రామం పేరిట టిడ్కో గృహాలను నిర్మించారు. 5 బ్లాకులుగా నిర్మించిన ఆదర్శగ్రామంలో 120 మంది లబ్ధిదారులకు కేటాయింపులు చేశారు. రూ.9 కోట్లు వ్యయంతో ఈ నిర్మాణం జరిగింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు 365 ఎస్ఎఫ్‌టీతో హాల్, కిచెన్, బెడ్ రూమ్ విత్ అటాచ్‌డ్ బాత్‌రూమ్‌తో అత్యంత ఆధునికంగా ఈ ఫ్లాట్ల నిర్మాణం జరిగింది. పిల్లర్స్‌తో పాటు గోడలు సైతం పూర్తిగా కాంక్రీట్‌తో నిర్మాణం చేశారు. దీంతో పాటు యూజీడీ డ్రైన్, విద్యుత్ సప్‌లై, తాగు నీటి సరఫరా ముందుగానే అందుబాటులోకి తెచ్చారు. సకల సౌకర్యాలతో ఆదర్శగ్రామం లబ్ధిదారులను అబ్బురపరుస్తోంది.


అధునాతన కిచ్


అధునాతన టైల్స్‌తో కూడిన హాల్

జగనన్న చొరవతో సాధ్యమైంది



మాకు సొంతిల్లు లేకపోవడంతో దశాబ్దాలుగా అద్దె ఇంట్లోనే కుటుంబం అంతా జీవనం సాగిస్తున్నాం. చాలా కాలంగా ప్రభుత్వం అందించే ఇల్లు కోసం ఎదురుచూస్తున్నాం. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గతంలో ఇల్లు మంజూరు కాలేదు. గత ప్రభుత్వంలో డబ్బులు కట్టించుకున్నా ఇల్లు పూర్తికాలేదు. కేటాయింపులు జరగలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, చొరవతోనే పైనాపిల్ కాలనీలో మాకు ఇల్లు కేటాయించారు. అన్ని రకాల అనుమతులు కూడా లభించాయి.

– బైపల్లి ఎర్రమ్మ, ఆదర్శనగర్

ప్రభుత్వ పనితీరు అభినందనీయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనితీరు అద్భుతంగా ఉంది. పింఛన్లు, సంక్షేమ పథకాలు ద్వారా పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. అర్హత ఉన్నప్పటికీ చాలా కాలంగా మాకు ఇల్లు మంజూరు కాలేదు. అయితే వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి పెట్టడడంతో ఇల్లు కేటాయింపులు జరిగాయి. మాకు దబ్బందలో టిడ్కో ఇల్లు మంజూరైంది. పేదలను అన్ని రకాలుగా ఆదుకుంటున్న సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవడం ఎంతైనా అవసరం.

– పిల్లా సత్యవతి, ఎంవీపీ కాలనీ

క్లుప్తంగా

వృక్షాలతోనే మానవ మనుగడ


మొక్కలు నాటుతున్న ఎంపీ ఎంవీవీ

ఏయూక్యాంపస్: వృక్షాలతోనే మానవ మనుగడ సాధ్యపడుతుందని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఏయూ నాగార్జున హాస్టల్ ఎదురుగా మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ ఓ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, మానవత సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి, ప్రముఖ ఆడిటర్ జి.వెంకటేశ్వరరావు(జీవీ), తదితరులు పాల్గొన్నారు.

'విమ్స్‌లో క్యాంపు కార్యాలయాలు వద్దు'

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో రాష్ట్ర అధికారుల క్యాంప్ కార్యాలయాలు ఏర్పాటు చేయవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ రహదారిపై విమ్స్ ప్రధాన ద్వారం వద్ద సీపీఐ నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమ్స్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇందులో అధికారుల క్యాంప్ కార్యాలయాలు, విడిది ఏర్పాటు చేయాలనుకునే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అచ్యుతరావు, ఎస్.కె.రెహమాన్, సత్యాంజనేయ, మన్మథరావు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు

మహారాణిపేట : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర శుక్రవారం కారుణ్య నియామకాల ద్వారా అర్హులైన అభ్యర్థులకు పోస్టింగులిచ్చారు. కొంత మందికి పదోన్నతులు కల్పించారు. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని త్వరితగతిని ఉద్యోగాలు ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎం.పోలినాయుడు, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి రూ.10 వేల సాయం

ఎంవీపీ కాలనీ: ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో గాయాలపాలైన బాలిక చికిత్స కోసం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. 22వ వార్డు శివాజీపాలెంకు చెందిన ఓ బాలిక ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురైంది. స్థానికుల కాపాడి ఆస్పత్రికి తరలించారు. ఆ బాలిక కుటుంబ సభ్యులకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ లాసన్స్ బే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 22వ వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజం బీవోఎస్‌గా ఆచార్య డీవీఆర్ మూర్తి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం బీవోఎస్ చైర్మన్‌గా ఆచార్య డీవీఆర్ మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత నుంచి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. కార్యక్రమంలో ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య డీవీఆర్ మూర్తిని విభాగ ఆచార్యులు అభినందించారు.

గ్రంథాలయాన్ని ఆదివారమూ తెరిచి ఉంచాలి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయాన్ని సెలవు రోజు ఆదివారం కూడా తెరిచి ఉంచాలని పరిశోధకులు, విద్యార్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమతను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వివిధ ప్రభుత్వ నోటిఫికేషన్లు విడుదల అవుతున్న నేపథ్యంలో లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లు అవసరం అవుతాయన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె అధికారులకు సూచన చేస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

- అందుకే సీఎం వైఎస్ జగన్ అవసరం
- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- 23వ వార్డులో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..


పథకాల పట్టికను ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి


13వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సునీత


ఇంటింటి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ లావణ్య

మద్దిలపాలెం : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ దేశంలో ఆదర్శంగా నిలిచారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శుక్రవారం 23వ వార్డులో కార్పొరేటర్ గుడ్ల విజయసాయి ఆధ్వర్యంలో మద్దిలపాలెం 1086135 సచివాయంల పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలు క్షుణంగా తెలుసుకున్నార న్నారు. అందుకే రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్ కావాలని రాష్ట్ర ప్రజలు ముక్త కంఠంతో కోరకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు, 23వ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కెల్ల సునీత పాల్గొని పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో వార్డులో ఎంతో మంది పేదలు లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, భూమిరెడ్డి వెంకటరెడ్డి, భాస్కర్, వంకర బాబూరావు, కాకర గోవింద్, నందిత బేబీ, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

17వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డులో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదర్శనగర్ 101 సచివాలయం పరిధిలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గేదెల లావణ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతో పాటు ఎందుకు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్ అవసరమో వివరించారు.

ఎస్కార్టు విధుల్లో అప్రమత్తత అవసరం


కైలాసగిరి పోలీస్ మైదానంలో పరేడ్‌ను సందర్శిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు రిమాండ్ ఖైదీలను కోర్టుకు తీసుకెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. విశాఖలో కైలాసగిరి వద్ద ఏఆర్ పోలీస్ మైదానంలో జరిగిన పరేడ్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరేడ్‌లో ఆయనకు పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జైళ్ల నుంచి కోర్టుకు విచారణ కోసం తీసుకెళ్లి, తిరిగి జైల్‌కు తీసుకొచ్చినంత వరకు నిందితులు పారిపోకుండా ఎస్కార్టులో ఉన్న సిబ్బంది చాలా జాగ్రతగా ఉండాలన్నారు. నిందితుల నేర చరిత్రను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి, పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. సిబ్బంది సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు బి.రామకృష్ణ, వెంకటరావు, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, నాయుడు పాల్గొన్నారు.

గచ్చిబౌలిలో 24న కూచిపూడి కళా వైభవం

- 7209 మంది కళాకారులతో నాట్య ప్రదర్శన
- గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదుకు ప్రయత్నం

మద్దిలపాలెం : కూచిపూడి కళా వైభవం పేరిట ఈ నెల 24న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో మహాబృంద నాట్య ప్రదర్శన నిర్వహించనున్నామని భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లయన్ లలితారావు తెలిపారు. ఈ మేరకు వివరాలను ఆమె శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నమోదుకు 7209 మంది కూచిపూడి నాట్యకళాకారులతో మహా బృంద నాట్యం ప్రదర్శనకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇందులో దేశ, విదేశాల నుంచి పలువురు ప్రముఖ నాట్య కళాకారులు పాల్గొనున్నారన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాట్య గురువులు పసుమర్తి వెంకటరమణ, కన్నం వెంకటరమణారావు, వేణి, వసుధ, మాగంటి శిరిష, విజయ, జ్యోతి, చందన, శోభ, సత్య, ఆదిత్య పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద శిబిరం రేపు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ తెలిపారు. కీళ్ల నొప్పులు, చర్మ, ఎముకలకు సంబంధించిన సమస్యలకు చికిత్స అందిస్తారు. కేజీహెచ్ విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి అవసరమైన చికిత్స విధానాలు, ఔషధాలను సూచిస్తారని పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనేవారు తమ ఒరిజినల్ రిపోర్టులను తీసుకు రావాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం 9440191673 నంబరులో సంప్రదించాలన్నారు.

ఏయూ సమాచారమ్

విశిష్ట సేవలతో ఉద్యోగులకు గుర్తింపు


మద్ది ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న ఓఎస్‌డీ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: నిబద్ధతతో అందించే విశిష్ట సేవలతో ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ పవర్ హౌస్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన మద్ది ప్రసాదరెడ్డి ఆత్మీయ సత్కార కార్యక్రమం శుక్రవారం ఫార్మసీ కళాశాల సాంస్కృతిక వేదికపై జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషిచేసే ఉద్యోగులకు ఎల్లప్పుడూ వర్సిటీ చరిత్రపుటల్లో ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. అనంతరం ప్రసాదరెడ్డి దంపతులను పవర్‌హౌస్ సిబ్బంది సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.

గణిత శాస్త్ర విభాగాధిపతిగా అనురాధ కామేశ్వరి


ఉత్తర్వులు స్వీకరిస్తున్న అనురాధ కామేశ్వరి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య పి.అనురాధకామేశ్వరి నియమితులయ్యారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత నుంచి ఆమె నియామక ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం విభాగంలో బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆచార్య అనురాధ కామేశ్వరిని గణితశాస్త్ర విభాగ ఆచార్యులు అభినందించారు.

ఇన్‌చార్జి వీసీ సమతకు అభినందన


ఆచార్య కె.సమతను అభినందిస్తున్న మానవత సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమతను మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఓఎస్‌డీ, మానవత సంస్థ వర్సిటీ చైర్మన్ ఆచార్య వి.కృష్ణమోహన్, సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి, అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, ఆచార్య కె.సీతామాణిక్యం, డాక్టర్ రాజమాణిక్యం, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ గాంధీ అధ్యయన కేంద్రాన్ని సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి సందర్శించారు.

గెస్ట్ ఫ్యాకల్టీని పునరుద్ధరించాలి


రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సురేష్ మీనన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గతంలో పనిచేసిన గెస్ట్ ఫ్యాకల్టీని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్‌మీనన్ కోరారు. శుక్రవారం ఏయూలో ఒక సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీలో దివ్యాంగుల రిజర్వేషన్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దేవానంద్, డాక్టర్ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేస్తున్న అడ్వకేట్ అరెస్ట్

ఎంవీపీ కాలనీ: సోషల్ మీడియాలో వివాహితను టార్గెట్ చేస్తూ మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేస్తున్న వ్యక్తిని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన వివాహితతో ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలికి చెందిన అడ్వకేట్ గేదెల విజయబాబుకు ఒక కేసు విషయంలో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆమెను లోబరుచుకున్న విజయబాబు సన్నిహితంగా ఉన్నప్పుడు ఆమెకు తెలియకుండా ఫోటోలు, వీడియోలు తీశాడు. దీంతో ఆ వీడియోలు, ఫొటోలు కొద్ది పాటి మార్ఫింగ్‌లతో సోషల్ మీడియాలో పెట్టి వేధింపులకు దిగాడు. దీంతో ఆ వివాహిత నగర సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు విజయబాబును నిందితుడిగా గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేశారు.

భూమి కబ్జా చేసిన వారిపై చర్యలకు డిమాండ్

దాబాగార్డెన్స్ : వంశపారంపర్యంగా వచ్చిన తమ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తసుకుని, తప్పుడు డాక్యుమెంట్లతో ఆ భూములపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ ఇచ్చిన ప్లాన్‌ను రద్దు చేయాలని గుజ్జు చిన్నమ్మలు కోరారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాత గుడ్ల రాములుకు మద్దిలపాలెంలో సుమారు 3,250 గజాల స్థలం ఉండేదని, ఈ స్థలం పక్కన రాములు సోదరుడు సీతయ్యకు 3000 గజాల స్థలం ఉందని చెప్పారు. సీతయ్య వారసులు వారి స్థలంతో పాటు రాములు స్థలాన్ని కూడా కబ్జా చేశారన్నారు. కబ్జా చేసిన వారిలో సీతయ్య వారసులు గుడ్ల లక్ష్మి, గుడ్ల సన్యాసిబాబురెడ్డి, గుడ్ల సుజాత, సీరపు రమణబాయి, సీరపు పద్మావతి, వెంపాడ శాంతికుమారి, ఎస్. కనకమహాలక్ష్మి, నారాయణరెడ్డి ఉన్నారని తెలిపారు. వీరు ఆ స్థలాన్ని తప్పుడు డాక్యుమెంట్లతో విక్రయించారని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించకపోతే కోర్టును ఆశ్రయించనున్నట్టు చెప్పారు. సమావేశంలో రాములు వారసులు అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన 3వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఆర్కేబీచ్ నుంచి కైలాసగిరి వైపు బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులను వెనక నుంచి మరో వాహనం ఢీకొట్టడంతో కంగారు పడి యువకులు డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారు కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులు గోపాలపట్నంకు చెందిన ఆకాష్(19), అభిషేక్(19)గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆలోచింపజేసిన 'ఓ కాశీవాసి రావయ్యా'


ఓ కాశీవాసి రావయ్య నాటికలో సన్నివేశం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నెలవారీ నాటిక ప్రదర్శనలో భాగంగా శుక్రవారం ఓ కాశీవాసి రావయ్యా నాటిక అందరి మనస్సులను హత్తుకుంది. ప్రతి సన్నివేశం ఆలోచింపజేసింది. పి.టి.మాధవ్ కలం నుంచి జాలువారిన ఈ నాటిక.. ప్రస్తుత సమాజంలో లోపిస్తున్న మానవత్వం కారణంగా చివరికి ఎవరి తలకొరివి వాళ్లే పెట్టుకునే రోజు వస్తుందని ఇతివృత్తంగా సాగుతుంది. ఈ కథకు నటీనటుల చక్కని అభినయం తోడవ్వడంతో ప్రతి సన్నివేశాన్ని రక్తికట్టించి ఆకట్టుకున్నారు.

కేజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవోగా లక్ష్మీతులసి

మహారాణిపేట: కేజీహెచ్ డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా డాక్టర్ లక్ష్మి తులసి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ వాసుదేవ పదోన్నతిపై కర్నూలు బదిలీ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మి తులసిని కేజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవోగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.